క్లుప్తంగా

హాస్టళ్లకు ఇన్వర్టర్ల బహూకరణ



కోడూరు: మండలంలోని స్వతంత్రపురంలో ఎస్సీ బాలికల, బీసీ బాలుర వసతి గృహాలకు రెండు ఇన్వర్టర్లను బహూకరించారు. ఉల్లి పాలెం ప్రాథమికోన్నత పాఠశాలలో ఉపాధ్యాయుడిగా పనిచేస్తునన కాశీబొట్ల నాగభూషణం పూర్వవిద్యార్థులు, మిత్రుల సహకారంతో రూ.38 వేల విలువైన రెండు ఇన్వర్టర్లు, బ్యాటరీలను హాస్టళ్ల యాజమాన్యాలకు అందించారు. ఇటీవల మోపిదేవి గురుకుల పాఠశాలకు కూడా నాగభూషణం ఇన్వర్టర్లను అందించారు. లయన్స్ క్లబ్ మండలాధ్యక్షుడు పూతబోయిన సీతారత్నసాయిబాబు, స్వతంత్రపురం జెడ్పీ ప్రధానోపాధ్యాయుడు ఆలా వెంకటరమణ, వార్డెన్లు షేక్ షాజహాన్, సునీల్, తదితరులు పాల్గొన్నారు.

4 నుంచి రెవెన్యూ గ్రామ సభలు

గూడూరు: గ్రామాలలో రెవెన్యూ శాఖా పరమైన సమస్యల పరిష్కారానికి సెప్టెంబరు 4 నుంచి 8 వరకు గ్రామసభలు నిర్వహిస్తున్నట్లు గూడూరు తహసీల్దారు డి.రాజ్యలక్ష్మి తెలిపారు. గ్రామ సభల షెడ్యూలును ఆమె బుధవారం విడుదల చేశారు. షెడ్యూలు ప్రకారం 4న ముక్కొల్లు, 5న గండ్రం, 6న గూడూరు, 7న చిట్టిగూడూరు, 10న తరకటూరు, 11న పినగూడూరులంక, 12న జక్కంచర్ల, 13న కలపటం, 14న లేళ్లగరువు, 17న గురిజేపల్లి, 18న కంకటావ, 19న రామానుజవత్తర్లపల్లి, 20న నారికేడాలపాలెం, 21న కప్పలదొడ్డి, 24న కోకనారాయణ పాలెం, 25న రామరాజుపాలెం, 26న ఆకుమర్రు, 27న కంచాకోడూరు. 28న మద్దిపట్ల, అక్టోబరు1న రాయవరం, 2న పోలవరం, 3న ఐదుగుళ్లపల్లి, 4న రామన్నపేట, 5న ఆకులమన్నాడు, 8న మల్లవోలులో గ్రామసభలు నిర్వహించనున్నారు.

నేడు వికసిత్ భారత్ వర్క్‌షాప్


పెడన: కేంద్ర ప్రభుత్వ ఆధ్వర్యంలో వికసిత్ భారత్‌పై పెడన నియోజకవర్గ స్థాయిలో వర్క్‌షాప్ ఏర్పాటు చేసినట్లు పెడన ఎంపీడీవో వి.రెడ్డయ్య బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 29న మధ్యాహ్నం 2.30 గంటలకు గూడూరు రోడ్డులోని దేవాంగ కల్యాణ మండలంలో జరుగుతుందన్నారు. ఈ వర్క్‌షాపునకు నియోజకవర్గంలోని మండల స్థాయి అధికారులు, స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులందరూ ఆహ్వానితులేనని తెలిపారు.

దోమల నిర్మూలనకు ఫాగింగ్



పెదకళ్లేపల్లి(మోపిదేవి): మండల పరిధిలోని పెదకళ్లేపల్లిలో గ్రామ పంచాయతీ, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో దోమల నిర్మూలనకు పొగ మందు ఫాగింగ్ చేయించారు. రెండో విడతలో గ్రామంలో దోమలను నిర్మూలించేందుకు ఫాగింగ్ చేయించినట్లు సర్పంచ్ అరజా సంధ్యారాణి తెలిపారు. ఎంపీటీసీ కడవకొల్లు సీతారామాంజనేయులు, అరజా ఆషాదేవి, పంచాయతీ కార్యదర్శి రాజేంద్రప్రసాద్, ఆరోగ్య కేంద్ర సిబ్బంది ఎంపీహెచ్ఈవో ఎన్.బాబూరావు, హెల్త్ సూపర్ వైజర్ టీ సుధాకర్, హెల్త్ అసిస్టెంట్ ఖాన్ పాల్గొన్నారు.

ఇద్దరు ఫీల్డ్ అసిస్టెంట్ల నియామకం



అవనిగడ్డ: జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకంలో పనిచేసేందుకు ఇద్దరు ఫీల్డ్ అసిస్టెంట్లను నూతనంగా నియమించారు. స్థానిక ఎమ్మెల్యే కార్యాలయంలో బుధవారం జరిగిన కార్యక్రమంలో కోడూరు మండలం హంసలదీవి ఫీల్డ్ అసిస్టెంట్‌గా నియమితులైన భట్రాజు పృధ్వీసాయి, ఎడ్లంక ఫీల్డ్ అసిస్టెంట్ దోవా లక్ష్మణస్వామికి శాసనసభ్యులు మండలి బుద్ధప్రసాద్ నియామక పత్రాలు అందించారు. ఈ కార్యక్రమంలో ఏపీడీ పి.రామ్మోహనరావు, కోడూరు ఏపీవో కె.రవికుమార్ పాల్గొన్నారు.

నలుగురు జూదరుల అరెస్ట్

గుడివాడరూరల్: పట్టణంలోని ఓల్డ్ ఇండేన్ గ్యాస్ వీధిలో ఒక ఇంటిలో పేకాట నిర్వహిస్తున్నారనే సమాచారం మేరకు వన్‌టౌన్ ఎస్ఐ పి.గౌతమ్‌కుమార్, పోలీస్ సిబ్బంది బుధవారం దాడులు నిర్వహించారు. ఈ దాడిలో నలుగురు జూదరులను అదుపులోకి తీసుకుని వారి వద్ద నుంచి రూ.4,630 స్వాదీనం చేసుకున్నారు. నలుగురిని స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ సీఐ కొండపల్లి శ్రీనివాస్‌కు వచ్చిన సమాచారం మేరకు పేకాట శిబిరంపై దాడులు నిర్వహించినట్లు పేర్కొన్నారు. ఎవరైనా అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు.

కేంద్రస్థాయిలో రక్షణ చర్యలు చేపట్టాలి



బాధితుల పేర్లు, ఫొటోలు బహిర్గతం చేయకూడదు. ఆ విధంగా సుప్రీంకోర్టు ఆదేశాలు ఇవ్వడం హర్షణీయం. పేర్లు, ఫొటోలు బహిర్గతం చేయడం వల్ల బాధల్లో ఉన్న కుటుంబాన్ని కూడా బయటకు లాగినట్లవుతుంది. ఆ పరిస్థితి ఉండకూడదు. అసలు ఇటువంటి సంఘటనలు పునరావృతం కాకుండా రక్షణ చర్యలు పటిష్టంగా ఉండాలి. కేంద్రస్థాయిలో రక్షణ చర్యలు చేపట్టి త్వరితగతిన అమల్లోకి తీసుకురావాలి.

-డాక్టర్ వి.రమ్యసాయి, వైద్యాధికారిణి, చేవేంద్రపాలెం పీహెచ్‌సీ, పెడన మండలం



భయపడుతూ విధులు నిర్వహించాల్సి వస్తోంది



పటిష్టమైన రక్షణ చర్యలు లేకపోవడం వల్ల భయపడుతూ విధులు నిర్వహించాల్సి వస్తోంది. ఇటీవల పీహెచ్‌సీలను 24 గంటల పీహెచ్‌సీలుగా చేయడంతో స్టాఫ్ నర్సులు షిఫ్టుల ప్రకారం విధులు నిర్వహిస్తున్నాం. రాత్రి సమయంలో విధులు నిర్వహించడం వల్ల కొంత భయం వెంటాడుతుంది. సీసీ కెమెరాలు, పటిష్టమైన రక్షణ చర్యలుంటే బాగుంటుంది. కేంద్ర ప్రభుత్వం తక్షణం పటిష్ట రక్షణ చర్యలు అమలు చేపడితే మంచిది.

-పి.కనకదుర్గ, స్టాఫ్ నర్సు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, పెడన

సేంద్రియ కూరగాయలు అందరికీ అందించండి

- జిల్లా కలెక్టర్ బాలాజీ
- సేంద్రియ కూరగాయల స్టాల్ సందర్శన



సేంద్రియ కూరగాయల స్టాల్స్‌ని పరిశీలిస్తున్న కలెక్టర్ బాలాజీ

అవనిగడ్డ: రసాయనాలు వాడకుండా సేంద్రియ పద్ధతిలో సాగుచేసిన కూరగాయలు, ఆకుకూరలు అందరికీ అందేలా చూడాలని జీరో బేసిడ్ వ్యవసాయ అధికారులను జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ ఆదేశించారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయ సమావేశపు హాలు వద్ద సేంద్రియ ఎరువులతో పండించిన కూరగాయలు, ఆకు కూరల స్టాల్‌ని కలెక్టర్ సందర్శించారు. మోపిదేవి మండలం పెదప్రోలులో సేంద్రియ పద్ధతిన సాగుచేసిన సొరకాయ, అరటి, గోంగూర, పాలకూర వంటి కూరగాయలు, ఆకుకూరల ప్రదర్శన చేయగా వాటిని పండించిన తీరుని అడిగి తెలుసుకున్నారు. వీటిపై ప్రజలకు అవగాహన కల్పించి ఆరోగ్య కరమైన కూరగాయలు, ఆకుకూరలు అందరూ పండించుకునేలా చేయాలని నిర్వాహకులకు సూచించారు. ఇప్పటికే పలుచోట్ల రైతులు, మహిళలకు అవగాహన కల్పించి సాగు చేయిస్తున్నామని చెప్పగా, మరింత మంది రైతులు సాగుచేసేలా విస్తృత ప్రచారం చేయాలన్నారు. అనంతరం సేంద్రియ సాగుతో పండించిన పలు రకాల కూరగాయలు, ఆకుకూరలను నిర్వాహకులు కలెక్టర్‌కి అందజేశారు.

గ్రామాల్లో పారిశుధ్యంపై ఫిర్యాదు

మోపిదేవి: గ్రామాల్లో పారిశుధ్య చర్యలు చేట్టడం లేదని, పంచాయతీ సిబ్బంది ప్రధాన రహదారల వెంట చెత్త వేయడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడాల్సివస్తుందని జనసేన పార్టీ నాయకులు కోసూరు రామాంజనేయులు కలెక్టర్ డీకే బాలాజీ దృష్టికి తీసుకెళ్లారు. మోపిదేవి జెడ్పీపాఠశాలకు కలెక్టర్ బుధవారం రాగా వినతిపత్రం అందజేశారు. మోపిదేవి పంచాయతీకి డంపింగ్ యార్డు ఉన్నా, అధికారులు అయోధ్య కరకట్ట రహదారిపై చెత్త వేయడంతో అటుగా వెళ్లే ప్రయాణికులు దుర్వాసనతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని వివరించారు. స్పందన కార్యక్రమంలో అధికారుల దృష్టికి అనేకసార్లు తెచ్చినా పట్టించుకోలేదన్నారు. దీంతో కలెక్టర్ వెంటనే ఆర్డీవోతో ఫోన్‌లో మాట్లాడారు. డంపింగ్ యార్డు ఉండగా కరకట్టపై ఎందుకు చెత్త వేస్తున్నారని, ఈ సమస్యను వెంటనే పరిష్కరించాలని ఆదేశించారు.

కిచెన్ గార్డెన్ పరిశీలన



మోపిదేవి లో కిచెన్ గార్డెన్ గురించి విద్యార్థిని ప్రశ్నిస్తున్న కలెక్టర్ బాలాజీ

మోపిదేవి: మండలంలోని మోపిదేవి జెడ్పీపాఠశాలను కృష్ణా జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ బుధవారం సందర్శించారు. ఈ సందర్భంగా పాఠశాలలో కిచెన్ గార్డెన్ పరిశీలించారు. పాఠశాల ఆవరణలో సాగుచేస్తున్న గోంగూర, తోటకూర, ఇతర ఆకుకూరలు, బెండ, పొట్ల వంటి కూరగాయల సాగును విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. కిచెన్ గార్డెన్ కాన్సెప్ట్ విద్యార్థులకు కల్పిస్తే వారి తల్లిదండ్రులకు అవగాహన కల్పించడం ద్వారా సంప్రదాయ సాగుపై పునాది కాగలదన్నారు. అంతకుముందు మధ్యాహ్న భోజనం పరిశీలించారు. విద్యార్థులతో కలిసి భోజనం చేసి విద్యార్థుల అభిప్రాయాలు తెలుసుకున్నారు. డీఈవో తాహెరా సుల్తానా, జీరో బేస్ట్ నాచురల్ ఫార్మింగ్ జిల్లా అధికారి పార్థసారథి, హెచ్‌ఎం జయంతి, ఎంఈవో దుర్గా సాగర్, తహసీల్దార్ శ్రీవిద్య, ఎస్ఐ సత్యనారాయణ, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పాఠశాల ఆయాల వినతి..

గత మూడు మాసాలుగా వేతనాలు ఇవ్వడం లేదని పాఠశాలలో పనిచేస్తున్న ఆయాలు కలెక్టర్‌కు మొర పెట్టుకున్నారు. ప్రభుత్వం అందించే కొద్దిపాటి వేతనంతోనే కుటుంబాన్ని పోషించుకుంటున్నామని, త్వరగా వేతనాలు విడుదల చేయాలని విన్నవించుకున్నారు. కుకింగ్ ఏజెంట్స్‌కు కూడా వేతనాలు రాలేదని కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. వెంటనే అక్కడనే కమిషనర్‌తో ఫోన్‌లో మాట్లాడి త్వరగా వేతనాలు విడుదల చేయాలని సూచించారు.

ఈవ్‌టీజింగ్, ర్యాగింగ్‌కు పాల్పడితే చర్యలు

డీఎస్పీ అబ్దుల్ సుబాన్



సదస్సులో మాట్లాడుతున్న డీఎస్పీ అబ్దుల్‌సుబాన్

చిలకలపూడి(మచిలీపట్నం): ఈవ్ టీజింగ్, ర్యాగింగ్‌కు పాల్పడితే కఠినమైన చర్యలు తీసుకుంటామని బందరు డీఎస్పీ ఎండీ అబ్దుల్ సుబాన్ అన్నారు. కృష్ణా విశ్వవిద్యాలయంలో విద్యార్థులకు యాంటీ ర్యాగింగ్, ఈవ్ టీజింగ్, మాదకద్రవ్యాల వినియోగం తదితర అంశాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. డీఎస్పీ మాట్లాడుతూ తోటి విద్యార్థులపై ర్యాగింగ్‌కు పాల్పడితే కేసు నమోదు చేస్తే ఆరు నెలల నుంచి మూడు సంవత్సరాల వరకు జైలు శిక్ష పడే అవకాశం ఉందన్నారు. ర్యాగింగ్ విష సంస్కృతి అని, దానికి అందరూ దూరంగా ఉండాలన్నారు. ఒకసారి కేసు నమోదైతే వారి భవిష్యత్ ప్రశ్నార్థకంగా మారుతుందన్నారు. కళాశాలలో జూనియర్లు, సీనియర్ అని తేడా లేకుండా స్నేహపూర్వకంగా మెలగాలన్నారు. మాదకద్రవ్యాలు, గంజాయి రహిత సమాజమే లక్ష్యంగా ప్రతి ఒక్కరూ భాగస్వామ్యం కావాలన్నారు. తాత్కాలిక సంతోషం కోసం కొంత మంది వాటిని సేవించటం, అలవాటు చేసుకోవటం జరుగుతుందని, దాని ద్వారా వాటికి బానిసై జీవితాలను నాశనం చేసుకోవద్దన్నారు. కష్టపడి చదివి ఉన్నత లక్ష్యాలను చేరుకోవాలన్నారు. గంజాయి విక్రయాలు, మాదకద్రవ్యాల వాడాకాలపై ఎవరైనా సమాచారం అందిస్తే వారి వివరాలను గోప్యంగా ఉంచి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. సామాజిక మాధ్యమాలైన ఫేస్‌బుక్, వాట్సాప్, ఇన్‌స్టాగామ్‌ల పట్ల జాగ్రత్తగా ఉండాలన్నారు. సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. అపరచితులు, తెలియని వ్యక్తులు ఫోన్ కాల్స్ చేసి లోన్ యాప్‌లు, ఇన్వెస్ట్‌మెంట్ల పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. సైబర్ నేరాలకు గురైతే 1930కు ఫిర్యాదు చేయాలని ఆయన సూచించారు.

ప్రకృతి విపత్తులను ధైర్యంగా ఎదుర్కోండి

రక్షణ చర్యలను ప్రయోగాత్మకంగా ప్రదర్శించిన సిబ్బంది



వరదల్లో చిక్కుకున్న సమయంలో బయటపడే విధానం వివరిస్తున్న ఎన్‌డీఆర్‌ఎఫ్ సిబ్బంది

శ్రీకాకుళం(ఘంటసాల): ప్రకృతి విపత్తులు సంభవించినప్పుడు ప్రజలు ధైర్యంగా ఉండి ఎలా బయటపడాలో ఆలోచన చేయాలని ఎన్‌డీఆర్‌ఎఫ్ 10వ బెటాలియన్ కమాండర్ పింటి నంది తెలిపారు. బుధవారం మండలంలోని శ్రీకాకుళం గ్రామ పంచాయతీ ప్రాంగణంలో విజయవాడకు చెందిన ఎన్‌డీఆర్‌ఎఫ్ 10వ బెటాలియన్ కమాండెంట్ ప్రసన్న కుమార్ ఆదేశాల మేరు టీమ్ కమాండర్ ఇన్‌స్పెక్టర్ పింటు నంది ఆధ్వర్యంలో నేషనల్ డిజాస్టర్ రెస్పాన్స్ ఫోర్స్ రిస్క్యూ సిబ్బంది అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఆర్ చేసే విధానం ఎన్‌డీఆర్‌ఎఫ్ రెస్క్యూ టీమ్ సభ్యులు విద్యార్థులు, స్థానిక ప్రజలతో కలిసి ప్రదర్శన చేసి చూపించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ బి.వి జయ ప్రసాద్, మొవ్వ ఫైర్ స్టేషన్ ఆఫీసర్ కె.వెంకటేశ్వరరావు, డెప్యూటీ తహసీల్దార్ చప్పిడి చిట్టిబాబు, రీసర్వే డీటీ పుప్పాల శ్రీనివాసరావు, పంచాయతీ కార్యదర్శులు శ్రీనివాసరావు, రమాదేవి, వీఆర్వోలు, సచివాలయ, పంచాయతీ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలల్లో వంట షెడ్ల ఏర్పాటుకు చర్యలు

డీఈవో తాహెరా సుల్తానా



మోపిదేవి జెడ్పీపాఠశాలలో ఎంఈవో, హెచ్‌ఎంతో మాట్లాడుతున్న డీఈవో తాహెరా సుల్తానా


మోపిదేవి: ప్రభుత్వ పాఠశాలల్లో వంట షెడ్ల ఏర్పాటుకు చర్యలు తీసుకుంటామని డీఈవో తాహెరా సుల్తానా స్పష్టం చేశారు. మోపిదేవి జెడ్పీ పాఠశాలను బుధవారం ఆమె ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా పాఠశాలకు వంట షెడ్డు లేదని, సమీపంలోని బాలికల వసతి గృహం నుంచి పాఠశాలకు వచ్చే విద్యార్థులలో లెవెల్‌లో ఉన్న ఆట స్థలం నుంచే రావడం వల్ల వర్షకాలంలో విష సర్పాలతో భయపడాల్సి వస్తుందని, పాఠశాలలో ఇద్దరు పీడీ పోస్టులు ఖాళీగా ఉన్నట్లు పలు సమస్యలు ఆమె దృష్టికి వచ్చాయి. అనంతరం డీఈవో మాట్లాడుతూ పాఠశాలకు వంట షెడ్డు మంజూరు చేయిస్తామని, ఎన్ఆర్ఈజీఎస్ కింద ఆట స్థలం గ్రౌండ్ లెవెల్ చేయిస్తామని, అవుట్ సోర్సింగ్ విధానంలోనైనా పీడీలను నియమిస్తామన్నారు. కనీసం 10 మంది విద్యార్థుల కన్నా తక్కువ ఉన్న పాఠశాలలను సమీపంలోని మరో పాఠశాలలో విలీనం చేస్తామని వివరించారు. పాఠశాల హెచ్‌ఎం జయంతి, ఎంఈవో దుర్గా సాగర్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఈ పంట నమోదు పరిశీలన



కృత్తివెన్ను: రైతులు ఈ పంట నమోదును తప్పనిసరిగా చేయించుకోవాలని ఎంఏవో ఎస్. జెన్నీ తెలిపారు. బుధవారం మండలం చిన్నపాండ్రాక గ్రామంలో జరుగుతున్న ఈ పంట నమోదు ప్రక్రియను ఆమె పరిశీలించారు. ఈ పంట నమోదు జరిగిన వరి చేలకు మాత్రమే పంట బీమా సౌకర్యం వర్తిస్తుందన్నారు. భవిష్యత్తులో అనుకోకుండా ప్రకృతి వైపరీత్యాల వల్ల పంట దెబ్బతిన్నప్పుడు రైతుకు పరిహారం నమోదు చేయాలంటే తప్పనిసరిగా ఆ రైతు పొలం ఈ పంటలో నమోదై ఉండాల్సిందేనన్నారు. ఇటువంటి ప్రయోజనాలున్న ఈ పంట నమోదుకు ప్రతి రైతు శ్రద్ధగా చేయించుకోవాలన్నారు. సెప్టెంబర్ 15వ తేదీ వరకు మాత్రమే ఈ పంట నమోదు జరుగుతుందని రైతులు త్వరపడాలన్నారు.

ఉత్తమ ఉపాధ్యాయుడికి సత్కారం



గుడివాడ టౌన్: జాతీయ స్థాయి ఉత్తమ ఉపాధ్యాయుడి అవార్డుకు ఎంపికైన ఎం.శ్రీనివాసరావును ఎస్టీయూ నాయకులు బుధవారం సత్కరించారు. ఎస్‌పీఎస్ హైస్కూల్లో వక్తలు మాట్లాడుతూ శ్రీనివాసరావుకుఇంతటి గొప్ప అవార్డు రావడం 14 వేల మంది మున్సిపల్ ఉపాధ్యాయులకు గర్వ కారణమన్నారు. ఉపాధ్యాయులు సులభమైన రీతిలో బోధించేందుకు వీలుగా సైన్స్ మెటీరియల్ అందజేయడం శ్రీనివాసరావు ప్రత్యేకత అన్నారు. సుమారు 25 సంవత్సరాలు భౌతికశాస్త్ర బోధనారంగంలో తనదైన ముద్ర వేసుకున్నారని కొనియాడారు. హెచ్ఎం టీఎంఈ. రాణి, పీఎల్. నర్సమాంబ, ఎస్టీయూ నేత డి.చంద్రశేఖర్ పాల్గొన్నారు.

షాపుల నిర్వహణకు బహిరంగ వేలం

ఆలయ ఏసీ ఎన్ఎస్ చక్రధరరావు



మోపిదేవి దేవస్థానంలో వేలం నిర్వహిస్తున్న ఆలయ ఏసీ చక్రధరరావు

మోపిదేవి: మోపిదేవి శ్రీ వల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామివారి దేవస్థానంలో పలు షాపుల నిర్వహణకు సీల్డ్ టెండర్ కం బహిరంగ వేలం బుధవారం ఆలయ ప్రాంగణంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ ఏసీ ఎన్ఎస్ చక్రధరరావు మాట్లాడుతూ నవంబర్ 1, 2024 నుంచి అక్టోబర్ 10, 2025 సంవత్సరానికి గాను వేలం నిర్వహించినట్లు తెలిపారు. లడ్డూ ప్రసాదం సీల్డ్ టెండర్ ద్వారా ఆకులమన్నాడు గ్రామానికి చెందిన వంశీ పొందారని, పులిహోర ప్రసాదం తయారు చేసి ప్యాకింగ్ చేసేందుకు సీల్డ్ టెండర్ ద్వారా వక్కలగడ్డ గ్రామానికి చెందిన కె.లక్ష్మి పొందారని తెలిపారు. అరిటి పండ్లు, కొబ్బరికాయలు, తమలపాకులు సరఫరాకు సీల్డ్ టెండర్ ద్వారా కోసూరువారి పాలెంకు చెందిన సనకా సాయి వెంకట్ పొందినట్లు, సర్పదోష నివారణ పూజకు కావలసిన వెండి పూత నాగపడగలు సరఫరాకు సీల్డ్ టెండర్ ద్వారా మోపిదేవి వాస్తవ్యుడు ఎస్.బ్రహ్మానందం, ఖాళీ నెయ్యి, పెరుగు డబ్బాలు, పాత ఇనుము రద్దు కొనుగోలుకు సీల్డ్ టెండర్ ద్వారా విజయవాడకు చెందిన లక్ష్మీ వెంకటేశ్వర ఎంటర్ ప్రైజెస్ పొందినట్లు తెలిపారు. శ్రీస్వామివారి దేవస్థానం ప్రాంగణంలోని నాగమల్లి వృక్షం వద్ద ముడుపులు ఊడదీసుకునే హక్కునకు సీల్డ్ టెండర్ ద్వారా మోపిదేవి వాస్తవ్యులు రాయన శ్రీలక్ష్మి పొందారని వివరించారు. మిగతా షాపుల నిర్వహణకు ఎవరూ ముందుకు రానందున వాయిదా వేశామన్నారు. ఆలయ సూపరింటెండెంట్ బొప్పన సత్యనారాయణ, ఆలయ అధికారులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

పీఎఫ్, ఈఎస్ఐ అవకతవకలపై విచారణ వాయిదా

- విచారణకు డుమ్మా కొట్టిన కాంట్రాక్టర్
- ఆగ్రహం వ్యక్తం చేసిన అధికారులు
- సెప్టెంబరు 2న మళ్లీ విచారణకు నిర్ణయం
- తమ సొమ్ము జమ చేయాలంటూ కార్మికుల నినాదాలు



విచారణ చేస్తున్న ఆసుపత్రి సూపరింటెండెంట్ సుందరాచారి, చిత్రంలో కార్మిక నేత జయకర్

మచిలీపట్నంటౌన్: ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి, ప్రభుత్వ మెడికల్ కళాశాలలో పనిచేస్తున్న పారిశుధ్య కార్మికుల పీఎఫ్, ఈఎస్ఐ నిధుల అవకతవకలపై విచారణ గురువారం అసంపూర్తిగా ముగిసింది. విచారణకు హాజరుకావాలని మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్, ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ సుందరాచారి, డెప్యూటీ సూపరింటెండెంట్ శ్రీనివాసరావు కాంట్రాక్టర్ హరిప్రసాద్‌కు మంగళవారం సమాచారం ఇచ్చారు.

హాజరుకాని కాంట్రాక్టర్

అయితే హరిప్రసాద్ బుధవారం జరిగిన విచారణకు హాజరుకాకుండా పీఆర్వో కృష్ణప్రసాద్‌ను పంపారు. దీంతో సరైన సమాచారం లేకుండా విచారణకు హరిప్రసాద్ రాకుండా మీరు ఎందుకు వచ్చారంటూ కృష్ణప్రసాద్‌పై అధికారులు ఆగ్రహం వ్యక్తం చేశారు. విచారణకు ఆసుపత్రి ఆర్ఎంవో నిరంజన్ కుమార్, మెడికల్ కళాశాల అసిస్టెంట్ డైరెక్టర్ రోజ్, అఖిల భారత సఫారీ మజ్దూర్ కాంగ్రెస్ యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కుంపటి జయకర్‌బాబు, జీజీహెచ్ బ్రాంచ్ అధ్యక్షురాలు టి.దుర్గాభవాని, మెడికల్ కళాశాల బ్రాంచ్ అధ్యక్షురాలు ఎం.నీరజ తదితరులు హాజరయ్యారు.

సెప్టెంబర్ 2న మళ్లీ విచారణ..

ఈ సందర్భంగా విచారణను నిలుపుచేసి కాంట్రాక్టర్ హరిప్రసాద్‌ను పిలిచి మళ్లీ విచారించి తమకు న్యాయం చేయాలని కార్మిక సంఘ నాయకులు, కార్మికులు అధికారులను కోరారు. దీంతో సెప్టెంబర్ 2వ తేదీ సోమవారం తిరిగి విచారణ నిర్వహించాలని నిర్ణయించారు. ఈ సందర్భంగా జయకర్‌బాబు మాట్లాడుతూ కార్మికుల జీతాల నుంచి కాంట్రాక్టర్ పీఎఫ్, ఈఎస్ఐలకు సంబంధించి దాదాపు రూ.1.50 కోట్ల మేర వసూలు చేశారన్నారు. ఈ మొత్తాలను వారి ఖాతాల్లో జమ చేయకుండా తాత్సారం చేస్తున్నారన్నారు. వచ్చే నెల నుంచి కాంట్రాక్టర్ మారే పరిస్థితులు ఉన్నాయని ఈ నేపథ్యంలో కార్మికులకు ఈ మొత్తాలు ఎలా జమ చేసేలా అధికారులు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

సెప్టెంబర్ 4 నుంచి సమ్మెకు..

కాంట్రాక్టర్ వద్ద ఉన్న ఈ సొమ్మును కార్మికుల ఖాతాల్లో జమ చేయాలని కోరుతూ సెప్టెంబరు 4వ తేదీ నుంచి సమ్మెకు వెళతామని ఆగస్టు 21వ తేదీ సూపరింటెండెంట్ సుందరాచారికి సమ్మె నోటీస్ అందించామన్నారు. ప్రభుత్వాసుపత్రిలో 106 మంది, ప్రభుత్వ మెడికల్ కళాశాలలో 19 మంది కార్మికులు పనిచేస్తున్నారన్నారు. సెప్టెంబరు 2వ తేదీన జరిగే విచారణకు కాంట్రాక్టర్ హరిప్రసాద్ హాజరు కాకుంటే కార్మికులు 4వ తేదీ నుంచి నిరవధిక సమ్మెకు వెళ్లి విధులను బహిష్కరించటం జరుగుతుందని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో కార్మిక సంఘ నాయకులు ఎన్.నాగేశ్వరమ్మ, ఓ.నాగలక్ష్మి, ఎం. అనిల్, జె.ప్రసన్న, జి.అనూరాధ, సలీమ, నాగార్జున, బాలు, జోసఫ్ తదితరులు పాల్గొన్నారు.

తాగునీరు లేక ప్రజల ఇక్కట్లు



తాగునీటి కోసం వేచిచూస్తున్న మహిళలు



తాగునీటి పైపుల మరమ్మతు పనులను పరిశీలిస్తున్న సర్పంచ్ ప్రసాద్ బాబు

తెలుగురావుపాలెం(ఘంటసాల): తాగునీరు లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని మండలంలోని తెలుగురావుపాలెం గ్రామస్తులు బుధవారం వాపోయారు. గత వారం రోజుల నుంచి సక్రమంగా పంచాయతీ నీరు సరఫరా కాకపోవడంతో తాగు నీటి కోసం అష్టకష్టాలు పడాల్సి వస్తుందన్నారు. సమస్యను ప్రజా ప్రతినిధులు, అధికారులు దృష్టికి తీసుకెళ్లినా అదిగో ఇదిగో అంటూ కాలయాపన చేస్తున్నారని ఆరోపించారు. ఉన్నతాధి కారులు స్పందించి తాగునీటి సమస్య పరిష్కరించాలని కోరుతున్నారు.

సమస్య పరిష్కరిస్తాం..

తాగునీటి ఇబ్బందులను పరిష్కరిస్తానని తెలుగు రావుపాలెం సర్పంచ్ రాచూరి ప్రసాద్ బాబు అన్నారు. తాగునీరు పంపింగ్ చేసే విద్యుత్ మోటర్ కాలిపోవడంతో మరమ్మతులకు ఇచ్చామన్నారు. మూడు రోజుల సెలవులు రావడంతో సిబ్బంది అందుబాటులో లేకపోడంతో పనులు అవలేదన్నారు. వెంటనే ప్రజలకు తాగునీటిని అందిస్తామని తెలిపారు.

విద్యుత్ పోరాటం అమరులకు ఘన నివాళులు

గుడివాడ టౌన్: విద్యుత్ చార్జీలకు వ్యతిరేకంగా జరిగిన పోరాటంలో అమరులైన వారికి నివాళులర్పిస్తున్నామని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు ఆర్‌సీపీ రెడ్డి అన్నారు. స్థానిక కార్యాలయంలో బుధవారం విద్యుత్ అమరవీరుల సంస్మరణ సభ జరిగింది. ఆయన మాట్లాడుతూ 2000 ఆగస్టు 28న విద్యుత్ చార్జీల పెంపునకు నిరసనగా హైదరాబాద్‌లో నిరసన ప్రదర్శనపై అప్పటి టీడీపీ ప్రభుత్వం కాల్పులు జరిపి అనేకమందిని తుపాకి తూటాలతో గాయపర్చడంతో పాటు రామకృష్ణ, బాలస్వామి,విష్ణువర్ధన్‌రెడ్డిని బలితీసుకుందన్నారు. ఆనాటి ప్రభుత్వం విద్యుత్ చార్జీలు పెంచడానికి ప్రజలు పూర్తిగా వ్యతిరేకించారన్నారు. ఆనాటి నుంచి ఈనాటి వరకు విద్యుత్ ప్రైవేటీకరణపైనే ప్రభుత్వం దృష్టిపెట్టిందన్నారు. అందులో భాగంగానే అదానీకి స్మార్ట్ మీటర్ల తయారీ అప్పగిస్తున్నారన్నారు. లక్ష్మణరావు, రజిని, నాగమల్లేశ్వరరావు, కొండ, వెంకటేశ్వరరావు, యెషయ్య పాల్గొన్నారు.

నూతన కార్యవర్గం ఎన్నిక

గుడివాడ టౌన్: ది గుడివాడ రోడ్స్ అండ్ బిల్డింగ్స్ ఎంప్లాయిస్ కో–ఆపరేటివ్ క్రెడిట్ సొసైటీ ఎన్నిక బుధవారం ఏకగ్రీవంగా జరిగినట్లు ఎన్నికల అధికారిగా వ్యవహరించిన అసిస్టెంట్ రిజిస్ట్రార్ దాసరి అలంకార్ తెలిపారు. సొసైటీ అధ్యక్షుడిగా కనిగంటి పీటర్‌పాల్, ఉపాధ్యక్షుడిగా కోరు రామస్వామి, కోశాధికారిగా కటారి వెంకటేశ్వర్లు, కార్యవర్గ సభ్యులుగా చక్రాల భూపతిరాజు, జక్కుల విజయశేఖర్, సాలేటి వెంకటేశ్వరరావు, కనపర్తి సత్యవతి ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు తెలిపారు.

మత్తు పదార్థాలకు దూరంగా ఉండండి

పామర్రు(తోట్లవల్లూరు): మత్తు పదార్థాలకు అందరూ దూరంగా ఉండాలని, అదే శ్రేయస్కరమని ఎస్ఐ ఎం.అర్జునరాజు పేర్కొన్నారు. తోట్లవల్లూరు మండలం వల్లూరు పాలెం జెడ్పీ హైస్కూల్లో విద్యార్థులకు అవగాహన సదస్సును బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమాజంలో చెడు వ్యవసనాలతో జీవితాలను పాడు చేసుకుంటున్నారన్నారు. గంజాయి మత్తు పదార్థాలను తీసుకోవడం వలన భవిష్యత్ పాడైపోతుందన్నారు. ప్రస్తుతం సమాజంలో సైబర్ క్రైమ్‌లు ఎక్కువగా జరుగుతున్నాయని, వీటి పట్ల ఎంతో జాగ్రత్త వహించాలని సూచించారు. కార్యక్రమంలో హైస్కూల్ హెచ్ఎం స్వరాజ్యలక్ష్మి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.